## కులగణన సర్వేపై అధ్యయన కమిటీ

- చైర్మన్‌గా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నియామకం
- వెల్లడించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్, మార్చి 7 (నమస్తేతెలంగాణ): ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వేపై అధ్యయానికి సామాజికవేత్తలతో కమిటీని ఏర్పాటు చేసినట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. శుక్రవారం ఆయన సచివాలయంలో మాట్లాడుతూ కులగణన సర్వేలో భాగంగా పలు అంశాల సమాచారం (ఆర్థిక, రాజకీయ, విద్య, సామాజిక, న్యాయ) కూడా ప్రభుత్వం వద్దకు వచ్చిందని, కాబట్టి అధ్యయనం చేసి నివేదిక ఇవ్వడానికి కమిటీని ఏర్పాటు చేశామని వెల్లడించారు. కమిటీ చైర్మన్‌గా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా రిటైర్డ్ ప్రొఫెసర్ కంచె ఐలయ్య, కన్వీనర్‌గా ప్రవీణ్ చక్రవర్తి, సభ్యులుగా డాక్టర్ సుఖ్‌దేవ్, రిటైర్డ్ ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి, శాంతాసిన్హా, ప్రొఫెసర్లు హిమాన్షు, భూక్యా భంగ్యా, ప్రత్యేక ఆహ్వానితులుగా జీన్ డ్రీజ్ ఉంటారని చెప్పారు. కమిటీకి స్వతంత్ర హోదా ఇస్తున్నట్టు భట్టి పేర్కొన్నారు. సర్వేపై సమగ్రంగా అధ్యయనం చేసి నెలరోజుల్లోగా ప్రణాళికా సంఘానికి నివేదిక అందజేయాలని నిర్దేశించినట్టు వెల్లడించారు.

## అఖిలపక్ష సమావేశానికి రండి

- కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్‌లకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపు
- అన్ని పార్టీల ఎంపీలకూ ఆహ్వానం

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ) : కేంద్ర ప్రభుత్వం వద్ద అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై చర్చించేందుకు శనివారం ప్రజాభవన్‌లో అఖిలపక్ష సమావేశానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సమావేశానికి రావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లతోపాటు అన్ని పార్టీల ఎంపీలకు ఫోన్ చేశారు. పెండింగ్ సమస్యలపై పార్లమెంటులో, కేంద్ర వద్ద మాట్లాడాలనే ఉద్దేశంతో ఈ ప్రయత్నం చేసినట్టు తెలిపారు .

# అధికారం కోసమే గ్యారెంటీ హామీలిచ్చాం

- 500 కోట్లు కూడా పెట్టుబడి పెట్టలేని పరిస్థితి ఉంది
- 2036లో హైదరాబాద్‌లో ఒలంపిక్ గేమ్స్ నిర్వహిస్తాం
- కాంగ్రెస్‌లో ఉదాసీనత వల్లే ఎన్నికల్లో అపజయాలు
- ఢిల్లీలో ఓ చానల్ సదస్సులో సీఎం రేవంత్ వ్యాఖ్యలు



హైదరాబాద్, మార్చి 7(నమస్తే తెలంగాణ): ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయాలని తెలంగాణలో ప్రజలు గళమెత్తుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శాసన సభ ఎన్నికల వేళ అధికారం కోసమే గ్యారంటీల హామీలు ఇచ్చామని, కానీ ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం వద్ద రూ.500 కోట్లు కూడా పెట్టుబడి పెట్టలేని పరిస్థితి నెలకొన్నదని చెప్పుకొచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలో ఓ చానల్ నిర్వహించిన సదస్సులో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు రేవంత్‌రెడ్డి సమాధానమిచ్చారు. హైదరాబాద్‌ను గతంలో చంద్రబాబు, వైఎస్ఆర్, కేసీఆర్ అభివృద్ధి చేశారు కదా అని జర్నలిస్ట్ ప్రశ్నించగా హైదరాబాద్‌లో గోల్కొండ, చార్మినార్‌ను చంద్రబాబు నిర్మించారా అంటూ ఎదురు ప్రశ్నించారు. ప్రధానమంత్రి మోదీతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. పాలసీల విషయంలో మాత్రమే ఆయనతో విభేదిస్తానని తెలిపారు.

### అధికార రేసులో హామీలిచ్చాం

తెలంగాణ ప్రభుత్వానికి రూ. 3.75 లక్షల కోట్ల అప్పు ఉందని తెలిసి కూడా రైతులకు, ప్రజలకు, యువతకు హామీలు ఎలా ఇచ్చారని జర్నలిస్ట్ ప్రశ్నించగా ఎన్నికల నాటి పరిస్థితుల కారణంగా హామీలు ఇవ్వాల్సి వచ్చిందని తెలిపారు. అధికార రేసులో భాగంగానే ప్రజలకు గ్యారంటీ హామీలు ఇచ్చినట్టు స్పష్టంచేశారు. మరి అధికారంలోకి వచ్చాక అప్పులున్నాయని తెలిసి కూడా తొలి బడ్జెట్‌లో హామీల అమలు కోసం రూ.50వేల కోట్లు ఎలా కేటాయించారని రిపోర్టర్ ప్రశ్నించగా రేవంత్‌రెడ్డి సమాధానం దాటవేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా తయారైందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం తరపున కనీసం రూ.500 కోట్ల పెట్టుబడి కూడా పెట్టే పరిస్థితి లేదని చెప్పారు. రాజకీయలబ్ధి కోసమే కేంద్ర ప్రభు త్వం నియోజకవర్గాల పునర్విభజన అంశాన్ని ఎత్తుకుందని ఆరోపించారు. హిందీ జాతీయ భాష కాదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

### మంత్రులు కూడా మర్చిపోతున్నారు?

సీఎం రేవంత్‌రెడ్డి పేరును ఆఖరికి మంత్రివర్గ సహచరులు కూడా హఠాత్తుగా చెప్పలేని పరిస్థితి నెలకొన్నది. తాజాగా మంత్రి పొన్నం ప్రభాకర్ సీఎం రేవంత్‌రెడ్డి పేరును మర్చిపోయారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన సందర్భంలో 'గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్' అంటూ సంబోధించారు. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వినోభానగర్‌లో సీతారామ ప్రాజెక్టు మెయిన్ కెనాల్ నుంచి వైరా రిజర్వాయర్‌కు బుధవారం నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సీఎం రేవంత్‌రెడ్డి పేరు చెప్పలేకపోయారు. ముఖ్యమంత్రి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు అన్న అంటూ తడబడ్డారు. ఫిబ్రవరి 28న గచ్చిబౌలిలో డీఆర్‌డీవో కార్యక్రమంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. అక్కడ పరేడ్ సందర్భంగా యాంకర్ సీఎం రేవంత్‌రెడ్డి పేరు మర్చిపోయారు. రాజ్‌నాథ్‌సింగ్ కూడా రేవంత్‌రెడ్డి పేరును ఏ రేవ్‌నాథ్ జీ రెడ్డి అంటూ పలికారు. అంతకుముందే పుష్ప-2 సినిమా ఫంక్షన్‌లో సినీనటుడు అల్లు అర్జున్, ప్రెస్‌మీట్‌లలో మంత్రి జూపల్లి కృష్ణారావు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, తెలుగు ప్రపంచ సమాఖ్య కార్యక్రమంలో వ్యాఖ్యాత గా వ్యవహరించిన నటుడు బాలాదిత్య సీఎం పేరును మర్చిపోయారు.

### జర్నలిస్ట్‌ల ప్రశ్నలకు రేవంత్ గప్‌చుప్

| | |
|---|---|
| రాష్ట్రానికి రూ.3.75లక్షల కోట్ల అప్పులున్నాయని తెలిసి హామీలు ఎందుకిచ్చారు? | సమాధానం లేదు |
| అధికారంలోకి వచ్చాకే అప్పుల గురించి తెలిసిందా? | సమాధానం లేదు |
| నిధులే లేనప్పుడు తొలి బడ్జెట్‌లో హామీల అమలు కోసమంటూ రూ.50 వేల కోట్లను ఎలా పెట్టారు? | సమాధానం లేదు |
| రాజకీయ లబ్ధి కోసమే కులగణనను తెలంగాణలో చేపట్టారా? | సమాధానం లేదు |
| కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు కాంగ్రెస్ సర్కారు చేపట్టిందా? | సమాధానం లేదు |
| బీజేపీ హిందుత్వకు పోటీగానే కులగణనను తెరపైకి తీసుకొచ్చారా? | సమాధానం లేదు |


### మళ్లీ సీఎం పేరు మర్చిపోయారు

సీఎం రేవంత్‌రెడ్డి పేరును వివిధ వేదికలపై మర్చిపోతున్నారు. ఢిల్లీలో జరిగిన సదస్సులో ఓ జర్నలిస్ట్ రేవంత్‌రెడ్డి పేరును చెప్పలేకపోయారు. సీఎం రేవంత్‌ని సదరు జర్నలిస్ట్ 'మిస్టర్ మోదీ' అని సం బోధించారు. మళ్లీ తేరుకొని 'మిస్టర్ రెడ్డి' అని సవరించుకున్నారు. దీంతో రేవంత్‌రెడ్డి కూడా నవ్వుకున్నారు. ఈ ఘటనపై సోషల్ మీడియాలో సెటైర్లు చక్కర్లు కొడుతున్నాయి. తను భడే భాయ్ అని పిలుచుకునే మోదీ పేరుతో పిలిచినందుకు రేవంత్ మురిసిపోతున్నారని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

# మరో 16 వేల ఎకరాల భూసేకరణ

మొదటిపేజీ తరువాయి...

ఆమనగల్లు మండలాల్లో సేకరించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నది. ఫ్యూచర్ సిటీని 815 చదరపు కిలోమీటర్ల పరిధిలో నిర్మించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది. ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు, కడ్తాల్, కందుకూరు, మహేశ్వరం, మంచాల, యాచారం మండలాల పరిధిలోని 30 వేల ఎకరాల్లో సుమారు 815 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఈ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. ఏడు మండలాల్లోని 56 రెవెన్యూ గ్రామాలు 74 గ్రామాల పరిధిలో ఈ ఫ్యూచర్‌సిటీ విస్తరించే విధంగా అధికారులు ప్రణాళికలు సిద్ధంచేశారు. ఇప్పటికే యాచారం మండలం మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలతోపాటు కందుకూరు మండలం ఆకులమైలారం, ముచ్చర్ల, పంజాగూడ, మీరఖాన్‌పేట్, తదితర గ్రామాల్లో 14 వేల ఎకరాల భూములను సేకరించారు.




ప్రతిపాదిత ఫ్యూచర్‌సిటీ ఊహాచిత్రం

### 16 వేల ఎకరాల కోసం ప్రతిపాదనలు సిద్ధం

ఫ్యూచర్ సిటీ కోసం అదనంగా మరో 16 వేల ఎకరాలను కడ్తాల్, ఆమనగల్లు మండలాల్లో సేకరించడం కోసం గతంలోనే ప్రతిపాదనలు సిద్ధంచేశారు. ఇప్పటికే భూసేకరణ చేపట్టిన గ్రామాల్లో రైతులు పట్టా భూములు ఇవ్వబోమని కోర్టును ఆశ్రయించడంతోపాటు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతున్నారు. 2,500 ఎకరాల పట్టా భూములను రైతుల నుంచి ప్రభుత్వం బలవంతంగా సేకరించింది. కోర్టు కూడా బలవంతంగా భూములనుసేకరించొద్దని అధికారులను ఆదేశించింది. అయినా ప్రభుత్వం యాచారం మండలంలోని నాలుగు గ్రామాల్లో ఉన్న 2,500 ఎకరాలకు సంబంధించి పట్టా భూముల పరిహారాన్ని అథారిటీలో జమచేసి పట్టాకాలం నుంచి రైతులను తొలగించి ఆ భూములను టీఎస్ఐఐసీ ఆధీనంలో చేర్చుకున్నది. దీంతో తమ భూములు తమకు ఇవ్వాలని గత కొంతకాలంగా రైతులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. ఈ ఆందోళనలు కొనసాగుతుండగానే, మరో 16 వేల ఎకరాల భూసేకరణ చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఈ ఫ్యూచర్ సిటీని ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్, సాగర్, శ్రీశైలం హైవేల మధ్యన నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఒకవైపు ఆందోళనలు కొనసాగుతండగా, మరో 16 వేల ఎకరాల భూమి సేకరణ సాధ్యమయ్యే పనేనా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## ఆర్టీసీ ఉద్యోగులకు 2.5 శాతం డీఏ

- మంత్రి పొన్నం ప్రకటన



హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం 2.5 శాతం డీఏను ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. డీఏ ప్రకటనతో ఆర్టీసీపై ప్రతినెలా రూ.3.6 కోట్ల అదనపు భారం పడనున్నట్టు తెలిపారు. మహిళా సమాఖ్య సంఘాల ద్వారా నేడు(శనివారం) 150 అద్దె బస్సులను ఆర్టీసీలోకి తీసుకొస్తున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నట్టు చెప్పారు. తరువాత దశలో 450 కలిపి మొత్తం 600 బస్సులను అద్దె ప్రాతిపదికన ఒప్పందం చేసుకున్నట్టు తెలిపారు.

# హోంశాఖలో ఎక్కడి ఫైళ్లు అక్కడే

- సీఎం వద్ద కుప్పలుగా పేరుకుపోయిన ఫైళ్లు
- పోలీస్ బడ్జెట్ ఫైల్‌కూ లభించని మోక్షం
- పెరోల్ కోసం ఎందరో ఖైదీల ఎదురుచూపు



హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర హోంశాఖను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన వద్దే అంటి పెట్టుకోవడం ఆ శాఖకు శాపంగా మారింది. ఇతర శాఖల వ్యవహారాలు, ప్రభుత్వ పనుల్లో ఆయన మునిగిపోవడంతో హోంశాఖలో ఎన్నో కీలక ఫైళ్ల పరిస్థితి 'ఎక్కడి గొంగలి అక్కడే' అన్న చందంగా తయారైంది. రాష్ట్ర భద్రతకు అత్యంత కీలకమైన పోలీస్ శాఖ బడ్జెట్ ఫైల్‌తోపాటు జైళ్లు, ఇంటెలిజెన్స్, ఉమెన్ సేఫ్టీ, అగ్నిమాపక విభాగాల ఫైళ్లు సీఎం వద్ద పేరుకుపోయినట్టు తెలిసింది. పెరోల్ కోసం జైళ్లలోని ఖైదీలు చేసుకున్న దరఖాస్తుల ఫైళ్లు కూడా పెండింగ్‌లో ఉండటంతో వారంతా సీఎం సంతకాల కోసం ఎదురుచూస్తున్నారు. హోంశాఖకు ప్రత్యేకంగా మంత్రి లేకపోవడం, అనేక ఫైళ్లు, బిల్లులు ముందుకు కదలకపోవడంతో ఎన్నో పనులు ఆగిపోయాయని పోలీస్ అధికారులు చెప్తున్నారు.

### కదలని బడ్జెట్ ఫైల్

రాష్ట్ర బడ్జెట్‌లో హోంశాఖకు కేటాయించాల్సిన నిధులతోపాటు ఆ శాఖకు సంబంధించిన పలు ఇతర అంశాలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గత నెల 22న సచివాలయంలో పోలీస్ ఉన్నతాధికారులతో చర్చించారు. హైదరాబాద్ సహా ఇతర ప్రాంతాలకు వలసలు పెరుగుతున్నందున ఆ మేరకు భద్రత కల్పించేందుకు హోంశాఖ సిద్ధం కావాలని గుర్తు చేశారు. పోలీస్ అధికారులు, సిబ్బంది కోసం క్వార్టర్స్ నిర్మించాల్సిన అవసరం ఉన్నందున వెంటనే ప్రతిపాదనలు పంపాలని సూచించడంతో గ్రేహౌండ్స్, నార్కోటిక్స్, ఇంటెలిజెన్స్, ఫైర్, ఎక్స్ సర్వీస్ మెన్ తదితర 8 విభాగాల ఉన్నతాధికారులు అప్పటికే సిద్ధం చేసిన ఫైళ్లను పంపారు. హోంశాఖ అవసరాల కోసం బడ్జెట్‌లో కేటాయించాల్సిన నిధులపై డీజీపీ జితేందర్ ఓ నివేదికను సమర్పించారు. ముఖ్యమంత్రి, హోంమంత్రి హోదాలో సంతకాలు చేయాల్సిన ఆ ఫైళ్లకు ఇంకా మోక్షం కలగలేదని సమాచారం. హోంశాఖ బడ్జెట్‌పై ఏమీ తేల్చకుండానే ప్రభుత్వం ఈ నెలలో బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తుండటంతో పోలీస్ అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సీఎం కొంచెం వీలు చూసుకొని తమ ఫైళ్లపై సంతకాలు చేయాలని కోరుతున్నారు.

## ఫ్యామిలీ కథకు గ్రీన్‌సిగ్నల్?



హీరో రవితేజ గత కొంతకాలంగా వరుసగా మాస్, యాక్షన్ కథలతోనే సినిమాలు చేస్తున్నారు. ఆయన నుంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ వచ్చి చాలా ఏళ్లయింది. తాజా సమాచారం ప్రకారం ఆయన పూరిస్థాయి కుటుంబ కథా చిత్రానికి ఓకే చెప్పారని తెలిసింది. దీనికి కిషోర్ తిరుమల దర్శకత్వం వహిస్తారని సమాచారం. బీవీఎస్ రవి కథ సమకూర్చుతున్నారని తెలిసింది. నేను శైలజ, ఉన్నది ఒకటే జిందగీ, ఆడవాళ్లు మీకు జోహార్లు వంటి చిత్రాలతో కిషోర్ తిరుమల ఫీల్‌గుడ్ చిత్రాల దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు. రవితేజ సినిమా కోసం వినోదాత్మకంగ సాగే ఓ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను సిద్ధం చేస్తున్నారని తెలిసింది. ఇందులో ఇద్దరు నాయికలకు చోటుంటుందని సమాచారం. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడుతుందని తెలుస్తున్నది. ప్రస్తుతం రవితేజ 'మాస్ జాతర' చిత్రంలో నటిస్తున్నారు. త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది.

చిత్రం

## సురేందర్ రెడ్డి దర్శకత్వంలో?

'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంతో కెరీర్‌లోనే బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ హిట్‌ను సొంతం చేసుకున్నారు అగ్ర కథానాయకుడు వెంకటేష్. 300కోట్ల పైచిలుకు వసూళ్లతో తెలుగు ప్రాంతీయ సినిమా కలెక్షన్స్‌లో రికార్డు సృష్టించింది. ఈ నేపథ్యంలో ఆయన తదుపరి సినిమా ఏమిటన్నది అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నది. ప్రస్తుతం వెంకటేష్ కథల్ని వింటున్నారని తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం సురేందర్ రెడ్డి దర్శకత్వంలో ఆయన సినిమా చేసే అవకాశం ఉందని ఫిల్మ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. ఇటీవలే వెంకటేష్‌ను కలిసి సురేందర్ రెడ్డి కథ చెప్పారని అంటున్నారు. అన్నీ కుదిరతే వెంకటేష్ ఈ సినిమాకు అంగీకరించే అవకాశాలున్నాయని సమాచారం. వెంకటేష్ నటించిన 'రానా నాయుడు' వెబ్‌సిరీస్ సెకండ్ సీజన్ త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది.



## 'రుద్ర' పాత్రలో మహేశ్‌బాబు?



ప్రస్తుతం మహేష్‌బాబు ఒడిశాలో ఉన్నారు. రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ నెలాఖరు వరకు అక్కడి పర్వత ప్రాంతాల్లోని పలు లొకేషన్లలో ప్రధాన ఘట్టాలను తెరకెక్కించబోతున్నట్లు తెలిసింది. ఈ పాన్ వరల్డ్ యాక్షన్ అడ్వెంచర్ కోసం మహేష్‌బాబు సరికొత్త మేకోవర్‌తో సిద్ధమయ్యారు. తాజాగా ఈ సినిమాలో మహేష్‌బాబు పాత్ర గురించి ఆసక్తికరమైన విషయం బయటికొచ్చింది. ఇందులో ఆయన రుద్ర అనే పాత్రలో కనిపిస్తారని తెలిసింది. మహేష్‌బాబు సినిమాల్లో ఆయన పాత్రల పేర్ల విషయంలో కూడా ప్రత్యేకతలు కనిపిస్తాయి. 'పోకిరి'లో పండు, 'అతడు'లో పార్థు, 'గుంటూరు కారం'లో రమణ వంటి పేర్లు ప్రేక్షకులకు బాగా గుర్తుండిపోయాయి. దాంతో రాజమౌళి సినిమాలోని 'రుద్ర' అనే పేరు కూడా పాన్ ఇండియాకు రీచ్ అయ్యేలా బాగుందని అభిమానులు సోషల్‌మీడియాలో అభిప్రాయపడుతున్నారు. ఇక ఈ సినిమాకు 'గరుడ' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. అయితే టైటిల్ విషయంలో ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. దాదాపు వెయ్యికోట్ల బడ్జెట్‌తో దుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్.నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## పాటల పల్లకిలో 'జాక్'



సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'జాక్'. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకుడు. శ్రీవెంకటేశ్వర సినీ చిత్ర పతాకంపై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించారు. ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకురానుంది. మ్యూజిక్ ప్రమోషన్స్‌లో భాగంగా శుక్రవారం 'ఫ్లాబో నెరుడా' అనే తొలి గీతాన్ని విడుదల చేశారు. అచ్చు రాజమణి స్వరపరచిన ఈ గీతాన్ని వనమాలి రచించారు. బెన్నీ దయాల్ ఆలపించారు. హీరో పరిచయ గీతమిదని, విజువల్స్ కట్టిపడేస్తాయని చిత్ర బృందం పేర్కొంది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, సిద్ధు జొన్నలగడ్డ పాత్ర నవ్యరీతిలో సాగుతుందని మేకర్స్ తెలిపారు. వైష్ణవిచైతన్య, ప్రకాష్‌రాజ్, నరేష్, బ్రహ్మాజీ తదితరులు ఈ చిత్రంలో నటించారు.



## ఆస్తులు అమ్మేసిన ప్రియాంక

బాలీవుడ్ నుంచి హాలీవుడ్‌కు వెళ్లి గ్లోబల్‌స్టార్‌గా పేరు తెచ్చుకుంది ప్రియాంకచోప్రా. ప్రస్తుతం ఈ భామ రాజమౌళి-మహేష్‌బాబు చిత్రంలో కీలక పాత్రను పోషిస్తున్నది. ఈ సినిమా షూటింగ్ కోసం ప్రియాంక ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నది. ఇదిలావుండగా ప్రియాంకచోప్రా ముంబయిలోని విలాసవంతమైన ఫ్లాట్‌లను విక్రయించిందని ఇండెక్స్ ట్యాప్ అనే సంస్థ వెల్లడించింది. ముంబయి అంధేరిలో ఉన్న ఒబెరాయ్ స్కైగార్డెన్ కమ్యూనిటీలోని ఫ్లాట్‌లను అత్యంత ఖరీదైనవిగా చెబుతారు. ఈ కమ్యూనిటీలో ప్రియాంకచోప్రాకు నాలుగు ఫ్లాట్‌లున్నాయి. వాటిని దాదాపు 16కోట్లకు ఆమె విక్రయించారని తెలిసింది. రెండేళ్ల క్రితం కూడా ముంబయి లోఖండ్‌వాలాలో ఉన్న రెండు పెంట్‌హౌజ్‌లను ప్రియాంక చోప్రా విక్రయించింది. భర్త నిక్‌జోనస్‌తో కలిసి లాస్‌ఏంజెలస్‌లో స్థిరపడింది ప్రియాంక చోప్రా. ఈ నేపథ్యంలో ఆమె ముంబయిలో తన ఆస్తులన్నింటినీ విక్రయించే ఆలోచనలో ఉందని వార్తలు వినిపిస్తున్నాయి. ప్రియాంకచోప్రాకు ముంబయితో పాటు గోవా, న్యూయార్క్, లాస్‌ఏంజెలెస్‌లో విలాసవంతమైన సొంత భవంతులు ఉన్నాయి.



## తెలుగులో రానున్న 'పింటు కీ పప్పీ'

హిందీ చిత్రం 'పింటు కీ పప్పీ' తెలుగులో 'కిస్ కిస్ కిస్సిక్' పేరుతో రిలీజ్ కానుంది. సుశాంత్, జాన్యాజోషి జంటగా నటించిన ఈ చిత్రానికి శివ్ హరే దర్శకత్వం వహించారు. విధి ఆచార్య నిర్మాత. ఈ నెల 21న హిందీతో పాటు దక్షిణాది భాషల్లో విడుదలకానుంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నది. ఈ నెల 8న ట్రైలర్ విడుదలకానుంది. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ఇదని, పింటు అనే యువకుడి ప్రేమ ప్రయాణంలో ఎదురైన సంఘటనలను హాస్య ప్రధానంగా ఆవిష్కరిస్తుందని దర్శకుడు తెలిపారు. విజయ్‌రాజ్, మురళీశర్మ, సునీల్ పాల్, అలీ అస్గర్ తదితరులు చిత్ర తారాగణం.

## భర్తతో మనస్పర్థలు లేవు



అధిక మోతాదులో నిద్ర మాత్రలు వేసుకొని అపస్మారక స్థితిలోకి వెళ్లిన గాయని కల్పన ప్రస్తుతం కోలుకుంటున్నది. తన భర్తపై మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతున్నదని, దానిని ఆపేయాలని ఆమె శుక్రవారం ఓ వీడియోను విడుదల చేసింది. 'నేను, నా భర్త సంతోషంగా జీవిస్తున్నాం. ప్రస్తుతం నేను పీహెచ్‌డీ, ఎల్ఎల్‌బీ చేస్తున్నాను. నా భర్త సహకారం వల్లే చదువుకోగలుగుతున్నా. మేమిద్దరం అన్యోన్యంగా ఉంటాం. మా మధ్య ఎలాంటి విభేదాలు లేవు. నిద్రలేమికి చికిత్స తీసుకుంటున్నా. మాత్రలు ఓవర్‌డోస్ కావడం వల్ల స్పృహ తప్పిపడిపోయాను. నా భర్త సరైన సమయంలో స్పందించడం వల్ల నేను మీ ముందున్నా. నా జీవితానికి ఓ వరం నా భర్త. త్వరలో నా పాటలతో మిమ్మల్ని అలరిస్తాను' అని కల్పన వీడియోలో చెప్పింది.

## వీలైతే మాజీ లవర్‌తో సినిమా చూడండి!



'లవ్ బ్రేకప్ అయితే లవర్ నుంచి దూరంగా ఉంటాం. వారిని ఓ శత్రువులా భావిస్తాం. కానీ ఈ సినిమ చూశాక మీ అభిప్రాయం మారుతుంది. ఇందులో మాజీ ప్రేయసి గురించి ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతారు' అన్నారు కిరణ్ అబ్బవరం. ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'దిల్ రూబా'. విశ్వకరుణ్ దర్శకుడు. రుక్సర్ థిల్లాన్ కథానాయిక. ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకురానుంది. గురువారం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ..వీలైతే ఈ సినిమాను ఎక్స్ లవర్‌తో చూడాలని, థియేటర్ నుంచి బయటకు వచ్చే ముందు మంచి ఫ్రెండ్‌షిప్ ఫీలింగ్‌తో వస్తారని, ప్రేమలోని సరికొత్త పాయింట్‌ను సినిమాలో చర్చించామని తెలిపారు. ప్రేమకంటే అది పంచే వ్యక్తులే గొప్పవారనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా తీశామని దర్శకుడు పేర్కొన్నారు. ఫీల్‌గుడ్ మూవీ ఇదని, అందరికి నచ్చుతుందని నిర్మాత రవి అన్నారు. ఈ సినిమాలో తాను పోషించిన అంజలి క్యారెక్టర్ గుర్తుండిపోతుందని కథానాయిక రుక్సర్ థిల్లాన్ చెప్పింది. ఈ చిత్రానికి సంగీతం: సామ్ సీఎస్, నిర్మాతలు: రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, విక్రమ్ మోహ్రా, సిద్ధార్థ్ ఆనంద్ కుమార్, రచన-దర్శకత్వం: విశ్వ కరుణ్.

## ఆ వార్తల్లో నిజం లేదు



ప్రముఖ నటి, నర్తకి వైజయంతిమాల మరణించారంటూ సోషల్‌మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఆమె కుటుంబ సభ్యులు ఖండించారు. ఈ వార్తలపై ఆమె కుమారుడు సుచింద్రబాలి స్పందించారు. సోషల్‌మీడియాలో వస్తున్న వార్తల్లో నిజంలేదని తెలిపారు. అమ్మ ఆరోగ్యంగా ఉన్నారని ఆయన చెప్పారు. 'వైజయంతిమాల చక్కటి ఆరోగ్యంతో ఉన్నారు. వార్తలు ప్రసారం చేసే ముందు వాస్తవాలు ఏమిటో తెలుసుకోండి. తప్పుడు ప్రచారాన్ని మానుకోండి' అంటూ వైజయంతిమాల కోడలు నందిని సైతం తన సోషల్‌మీడియాలో పోస్ట్‌లో పేర్కొంది. తమిళ ఇండస్ట్రీ ద్వారా కథానాయికగా పరిచమైన వైజయంతిమాల దక్షిణాదితో పాటు హిందీ చిత్రసీమలో అగ్ర కథానాయికగా గుర్తింపును తెచ్చుకున్నారు. దిలీప్‌కుమార్ 'దేవదాస్' (1955) చిత్రంలో ఆమె పోషించిన చంద్రముఖి పాత్రకు విశేషమైన ప్రాచుర్యం దక్కింది. ఆ సినిమా తర్వాత బాలీవుడ్ అగ్ర హీరోలతో కలిసి ఎన్నో హిట్ చిత్రాల్లో నటించి తిరుగులేని పేరుప్రఖ్యాతుల్ని సంపాదించుకుంది. గత ఏడాది కేంద్ర ప్రభుత్వం ఆమెను పద్మవిభూషణ్ పురస్కారంతో సత్కరించింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.